సాక్షి
రాజన్న సిరిసిల్ల
మంగళవారం • 17 • అక్టోబర్ • 2023

నెమలి వాహనంపై విహారింపు

వేములవాడ: రాజన్న సన్నిధిలో శ్రీదేవీ నవ రాత్రోత్సవాల్లో భాగంగా ఉత్సవమూర్తులను నెమలి వాహనంపై సోమవారం రాత్రి పుర వీధుల్లో ఊరేగించారు. ఆలయ అధికారులు, పురప్రముఖులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



న్యూస్‌రీల్

ఆస్పత్రిలో కేంద్ర బృందం పరిశీలన



వేములవాడ ఏరియా ఆస్పత్రిని పరిశీలిస్తున్న జాతీయ నాణ్యతహామీ ప్రమాణాల బృందం

వేములవాడఅర్బన్: స్థానిక ఏరియా ఆస్పత్రిని జాతీయ నాణ్యత హామీ ప్రమాణాల బృందం సోమవారం పరిశీలించింది. డాక్టర్ మనీశ్‌శర్మ, తనుశ్రీ బక్షి, సీమ బృందం మూడు రోజుల పాటు ఏరియా ఆస్పత్రిలోని 14 విభాగాలను క్షేత్రస్థాయిలో పరిశీలించనున్నారు. ఆస్పత్రిలో రోగులకు అందుతున్న వైద్యసేవలు, వైద్యుల పనితీరు, పరిసరాల పరిశుభ్రత, పరిపాలన విభాగాలను పరిశీలించి మార్కులు కేటాయించే అవకాశం ఉంటుంది. అత్యధికంగా స్కోర్ చేస్తే మూడేళ్లపాటు నాణ్యత ప్రమాణాలపత్రం తోపాటు ఏడాదికి రూ.10లక్షల నగదు ప్రోత్సాహం కూడా అందించే అవకాశం ఉంది. ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ రేగులపాటి మహేశ్ రావు, వైద్యులు అనిల్‌కుమార్, తిరుపతి సంతోష్‌చారి, నాగరాజు తదితరులు ఉన్నారు.

పండుగపూట కార్మికులను పస్తులుంచొద్దు



సిరిసిల్లటౌన్: పండుగ పూట నేతకార్మికులను పస్తులుంచొద్దని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ కోరారు. బతుకమ్మ చీరలు నేసిన సిరిసిల్లలోని కార్మికులకు ఇవ్వాల్సిన పది శాతం యారన్ సబ్సిడీ డబ్బులను వెంటనే అందించాలని కోరారు. ఈమేరకు సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం నేతకార్మికులు హైదరాబాద్‌లోని చేనేత జౌళిశాఖ కమిషనర్‌ను కలిసి వినతిపత్రం అందించారు. 2021 నుంచి 10 శాతం యారన్ సబ్సిడీ డబ్బులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. 2018 ఏడాది 58 మందికి డబ్బులు రాలేవని పేర్కొన్నారు. ఎలిగేటి రాజశేఖర్, నక్క దేవదాసు, కూచన శంకర్, రమేశ్, సదానందం, చంద్రకాంత్, మల్లేశం, తిరుపతి, శ్రీనివాస్, కిరణ్ పాల్గొన్నారు.

గులాబీ ప్రచారభేరి!

- నేడు సిరిసిల్లలో ప్రజా ఆశీర్వాద సభ
- ఉమ్మడి జిల్లాలో రెండో శంఖారావం
- భారీ జనసమీకరణలో బీఆర్ఎస్ శ్రేణులు

సాక్షిప్రతినిధి, కరీంనగర్/సిరిసిల్ల: బీఆర్ఎస్ పార్టీ ఎన్నికల శంఖారావాన్ని పూరించింది. పార్టీకి, ఉద్యమానికి ఊపిరిలూదిన ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో వరుస సభలు నిర్వహిస్తూ కేడర్‌లో జోష్ నింపే ప్రయత్నిస్తోంది. ఆదివారం హుస్నాబాద్‌లో ప్రజా ఆశీర్వాద సభ విజయవంతమైంది. ఈక్రమంలో మంగళవారం సిరిసిల్లలో భారీ బహిరంగ సభ తలపెట్టింది. ఉమ్మడి జిల్లాలో బీఆర్ఎస్ నిర్వహించే రెండో భారీ ప్రచారసభ ఇదే కావడం గమనార్హం. సిరిసిల్ల ఎమ్మెల్యే, మంత్రి కె.తారకరామారావు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గం కేంద్రంగా ఎన్నికల ప్రచార సభలో సీఎం కె.చంద్రశేఖర్‌రావు ప్రసంగించనున్నారు. మధ్యాహ్నం 2 గంటలకు జరిగే సభ కోసం పదెకరాల స్థలాన్ని సిద్ధం చేశారు. సీఎం కేసీఆర్ హైదరాబాద్ నుంచి నేరుగా సిరిసిల్లకు హెలీకాప్టర్‌లో చేరుకుని ప్రసంగిస్తారు. అనంతరం సిద్దిపేటలో జరిగే సభకు వెళ్లనున్నారు. సీఎం కేసీఆర్ తనయుడు కేటీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న సిరిసిల్లలో తొలిసభ నిర్వహించడం విశేషం. 2009 నుంచి ఇప్పటి వరకు ప్రతీ ఎన్నికల్లో తనయుడి విజయం కోసం తండ్రి కేసీఆర్ బహిరంగ సభ నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది.

భారీ జనసమీకరణకు ఏర్పాట్లు

సీఎం కేసీఆర్ పాల్గొనే ప్రజా ఆశీర్వద బహిరంగ సభకు భారీగా జనాన్ని సమీకరించాలని బీఆర్ఎస్ వర్గాలు నిర్ణయించాయి. ఈమేరకు ఇప్పటికే మంత్రి కేటీఆర్ పార్టీ ముఖ్య నాయకులతో సమావేశమై దిశానిర్దేశనం చేశారు. సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోనే ఎక్కువ మందిని సమీకరించాలని భావిస్తున్నారు. తంగళ్లపల్లి, ముస్తాబాద్, ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి, గంభీరావుపేట మండలాల నుంచి ఎక్కువ మందిని సమీకరించి సభను సక్సెస్ చేయాలని ప్రణాళిక సిద్ధం చేశారు. 2018 నాటి ఎన్నికల ప్రచార సభను నిర్వహించిన స్థలంలోనే సభను ఏర్పాటు చేశారు. రెండుచోట్ల వాహనాల పార్కింగ్ ఏర్పాట్లు చేశారు. వంద మంది వీఐపీలు కూర్చునేలా స్టేజీని ఏర్పాటు చేశారు.

గులాబీమయమైన సిరిసిల్ల

సీఎం కేసీఆర్ పాల్గొనే సభ కోసం సిరిసిల్ల పట్టణాన్ని గులాబీ జెండాలతో అలంకరించారు. సిరిసిల్ల-కామారెడ్డి, సిరిసిల్ల-సిద్దిపేట, సిరిసిల్ల-వేములవాడ మార్గాల్లో రోడ్డుకు ఇరువైపులా కటౌట్లు, హోర్డింగ్‌లు ఏర్పాటు చేశారు. సిరిసిల్ల నిండాగులాబీ జెండాలతో నిండిపోయింది.



సోమవారం రాత్రి సభాస్థలిని పరిశీలిస్తున్న మంత్రి కేటీఆర్



గులాబీమయమైన సిరిసిల్లలోని చౌరస్తా

హామీల జల్లు కురిసేనా..

సీఎం కేసీఆర్ సిరిసిల్ల సభకు వస్తున్న సందర్భంగా ఈప్రాంత ప్రధాన సమస్యలపై సీఎం కేసీఆర్ హామీల జల్లు కురుస్తుందని ఆశిస్తున్నారు. మధ్యమానేరు జలాశయం పూర్తయినా.. గోదావరి జలాలు ఇంకా నర్మాల ఎగువ మానేరు, నిమ్మపల్లి మూలవాగు జలాశయాలకు చేరలేదు. కాళేశ్వరం ప్రాజెక్టు 9వ ప్యాకేజీలో భాగంగా మల్కపేట వరకు గోదావరి జలాలు చేరినా.. ఇంకా కొనసాగింపు పెండింగ్‌లోనే ఉంది. నేత కార్మికులను ఓనర్లను చేసే 'వర్కర్ టు ఓనర్' పథకం ఇంకా అందుబాటులోకి రాలేదు. షెడ్ల నిర్మాణంలో ఉండగా.. లూమ్స్ ఇంకా ఏర్పాటుకాలేదు. వేములవాడలో రోడ్డు విస్తరణ, ఆలయ అభివృద్ధి పనులు ముందుకు సాగడం లేదు. వేములవాడలో మూలవాగుపై రెండో వంతెన నిర్మాణంలో ఉంది. పెద్దూరు వద్ద అపెరల్ పార్క్‌లో అభివృద్ధి, నేతన్నల కోసం యారన్ డిపో ఏర్పాటు, ఇల్లులేని వారికి గృహలక్ష్మి పథకం మంజూరు వంటి పనులు పెండింగ్‌లో ఉన్నాయి. జిల్లా అభివృద్ధికి సీఎం కేసీఆర్ వరాల జల్లు కురిపిస్తారని ఆశిస్తున్నారు.

మంత్రి గంగుల వాహనం తనిఖీ

బోయినపల్లి(చొప్పదండి): కరీంనగర్-సిరిసిల్ల ప్రధాన రహదారిలో మండలంలోని కొదురుపాకలో ఏర్పాటు చేసిన పోలీస్ చెక్‌పోస్టు వద్ద ముమ్మర తనిఖీలు చేస్తున్నారు. వాహనాలను పూర్తిస్థాయి తనిఖీ చేసి వదిలి పెడుతున్నారు. సోమవారం కరీంనగర్ నుంచి సిరిసిల్ల వెళ్తున్న రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ వాహనాన్ని కొదురుపాక వద్ద పోలీసులు తనిఖీ చేశారు. మంత్రి గంగులతోపాటు వాహనంలో బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కె.కేశవరావు, ప్రణాళిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ ఉన్నారు.



కమలాకర్ వాహనం తనిఖీ చేస్తున్న పోలీసులు

వైఎస్సార్ హయాంలోనే వేములవాడకు సాగునీరు

- నాలుగుసార్లు ఓడినా జనంలోనే ఉన్నాను
- ఒక్కసారి అవకాశమిస్తే అభివృద్ధి చేసి చూపిస్తా
- కాంగ్రెస్ అభ్యర్థి ఆది శ్రీనివాస్

వేములవాడ: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలోనే వేములవాడకు సాగునీరు వచ్చిందని.. నాలుగుసార్లు ఓడిపోయినా జనంలోనే ఉంటూ సమస్యలపై పోరాడనని.. ఒక్కసారి అవకాశమిస్తే అభివృద్ధి చేసి చూపిస్తానని కాంగ్రెస్ అభ్యర్థి, డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ కోరారు. స్థానిక హరిమళ్ల గార్డెన్‌లో సోమవారం నిర్వహించిన నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. ఇందిరమ్మ ఇళ్లు లేని గ్రామం చూపిస్తే తాను రాజకీయాల నుంచి తప్పుకుంటానన్నారు. ఇదే సమయంలో బీఆర్ఎస్ నాయకులు ప్రతీ ఊరిలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు చూపిస్తారా.. అంటూ సవాల్ విసిరారు. సీఎం కేసీఆర్ గత మేనిఫెస్టోలోని హామీలు ఎన్ని నెరవేర్చారని ప్రశ్నించారు. అవకాశాల కోసం వలస వచ్చే నాయకులను నమ్మొద్దని.. జనంతోనే ఉన్న తనకు ఒక్కసారి అవకాశం ఇవ్వాలని కోరారు. వేములవాడ పట్టణ, అర్బన్, రూరర్, చందుర్తి మండలాల అధ్యక్షులు చంద్రగిరి శ్రీనివాస్‌గౌడ్, వకుళాభరణం శ్రీనివాస్, పిల్లి కనకయ్య, చింతపండు రామస్వామి, జెడ్పీటీసీ నాగం కుమార్, కాయితి నాగరాజు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సాగరం వెంకటస్వామి, అజీమ్, నాయకులు సంగ స్వామియాదవ్, చిలుక రమేశ్ పాల్గొన్నారు.



చేతులు జోడించి తనను గెలిపించాలని అభ్యర్థిస్తున్న ఆది శ్రీనివాస్

సంక్షేమ పాలన కేసీఆర్‌తోనే సాధ్యం

- తెలంగాణ అధికార భాషా సంఘం చైర్మన్ శ్రీదేవి

సిరిసిల్లటౌన్: అన్ని వర్గాలు, ప్రజలకు సంక్షేమ పాలన అందించడం ముఖ్యమంత్రి కేసీఆర్‌కే సాధ్యమని తెలంగాణ అధికార భాషా సంఘం చైర్మన్ మంత్రి శ్రీదేవి పేర్కొన్నారు. కేసీఆర్ ఆశీర్వాద సభకు రావాలని ఆహ్వానిస్తూ సోమవారం సిరిసిల్లలో గడపగడపకు ప్రచారం చేశారు. బీఆర్ఎస్ మేనిఫెస్టోలో మహిళలకు అధిక ప్రాధాన్యతనిచ్చారన్నారు. సిరిసిల్ల నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా మంత్రి కేటీఆర్‌ను అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. సిరిసిల్ల మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, గుగులోతు రేణ, చీరాల స్వాతి, స్వప్న, కవిత ఉన్నారు.



సిరిసిల్లలో ప్రచారం చేస్తున్న శ్రీదేవి, కళ

క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి

- కలెక్టర్ అనురాగ్ జయంతి
- నర్మాల గురుకులంలో ముగిసిన జోనల్ స్పోర్ట్స్ మీట్

గంభీరావుపేట(సిరిసిల్ల): విద్యార్థులు చదువుతోపాటు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని కలెక్టర్ అనురాగ్ జయంతి కోరారు. క్రీడలు, మానసిక శారీరక దారుఢ్యానికి దోహదపడతాయన్నారు. మండలంలోని నర్మాల సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో 9వ జోనల్ స్పోర్ట్స్ మీట్ సోమవారం ముగిసింది. నాలుగు రోజులుగా గురుకులాల విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి, ప్రతిభావంతులను పై స్థాయి టోర్నీలకు ఎంపిక చేశారు. విజేతలకు కలెక్టర్ అనురాగ్ జయంతి బహుమతులు ప్రదానం చేశారు. జోనల్ పరిధిలోని 13 పాఠశాలలకు చెందిన 115 మంది విద్యార్థులు జోనల్ మీట్‌లో భాగస్వాములయ్యారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్స్ వంటి పోటీలలో విద్యార్థులు తమ ప్రతిభ చాటారు. గురుకులాల ఉప కార్యదర్శి శ్రీనివాస్, ఆర్‌సీవో ఏసుపాదం, డీసీవో జాక్విలిన్, ప్రిన్సిపాల్ నిర్మల ఉన్నారు.



విజేతకు బహుమతి అందజేస్తున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

బీఆర్ఎస్ ఆఫీస్ ఆత్మగౌరవ ప్రతీక

- 45 రోజులు మా కోసం పనిచేయండి.. ఐదేళ్లు మీ కోసం పని చేస్తాం
- సిరిసిల్లలో మంత్రి కె.తారక రామారావు

సిరిసిల్ల: బీఆర్ఎస్ ఆఫీస్ ఆత్మగౌరవ ప్రతీకగా ఉంటుందని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, మున్సిపల్ శాఖ మంత్రి కె.తారక రామారావు పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలో సోమవారం బీఆర్ఎస్ పార్టీ ఆఫీస్ భవనాన్ని పార్టీ సెక్రటరీ జనరల్ కె.కేశవరావు చేతుల మీదుగా ప్రారంభించి మాట్లాడారు. అన్ని జిల్లాలోనూ బీఆర్ఎస్ పార్టీ ఆఫీస్‌ను నిర్మిస్తున్నామని వివరించారు. పార్టీ శిక్షణ తరగతులు, టెలీకాన్ఫరెన్స్‌లు, జనరల్ బాడీ సమావేశాలు, పెళ్లిళ్లకు, ఇతర ఫంక్షన్లకు పార్టీ ఆఫీస్ భవనం వేదిక కావాలన్నారు. తక్కువ ఫీజు తీసుకుని నిర్వహణ ఖర్చులను వెల్లదీయాలని సూచించారు. ప్రతిపక్ష పార్టీలు విమర్శలు చేస్తే వెంటనే ఖండించాలని సూచించారు. ఇన్ని మంచి పనులు చేస్తుంటే ఇంకా విమర్శించడం ఏమిటని ప్రశ్నించారు.

45 రోజులు మాకోసం పని చేయండి

మీరంతా ఈ 45 రోజులు మా కోసం పనిచేయండి.. మిగతా ఐదేళ్లు మీకోసం మేం పనిచేస్తామని కేటీఆర్ పేర్కొన్నారు. కేసీఆర్‌కు ఓటు వేయాలని ఓటర్లు స్పష్టంగా ఉన్నారని.. అభ్యర్థులు బాగానే ఉన్నారని, మధ్యలో గీ తెల్లంగీ వాళ్లతోనే తిప్పలు వచ్చిందన్నారు. ఏ పార్టీ వారైనా బీఆర్ఎస్‌లోకి వస్తామంటే కలుపుకొని పోవాలని కోరారు. మంత్రి గంగుల కమలాకర్ మాట్లాడుతూ సీఎం కేసీఆర్ తెలంగాణ ప్రజలకు దొరికిన ఆస్తి అని, ఆయన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ఈ సమాజంపై ఉందన్నారు. ప్రణాళికా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.వినోద్‌కుమార్, ఎమ్మెల్సీ ఎల్.రమణ, ఎమ్మెల్యేలు సుంకె రవిశంకర్, రసమయి బాలకిషన్, వేములవాడ ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడ లక్ష్మీనర్సింహారావు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య ప్రసంగించారు.

కొలువుదీరిన అధ్యక్షులు

బీఆర్ఎస్ ఆఫీస్‌లో జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, సిరిసిల్ల పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణిలను ఆఫీస్‌లోని అధ్యక్ష సీట్లతో కూర్చోబెట్టారు. జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, టీపీటీడీసీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, 'సెస్' చైర్మన్ చిక్కాల రామారావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఆకునూరి శంకరయ్య, రైతు బంధు సమితి అధ్యక్షుడు గడ్డం నర్సయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళాచక్రపాణి, వేములవాడ మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థం మాధవి, బీఆర్ఎస్ నాయకులు చీటి నర్సింగారావు పాల్గొన్నారు.



పార్టీ ఆఫీస్‌లో జిల్లా అధ్యక్షుడు ఆగయ్యకు సన్మానం

ఏఎస్‌వోలకు ఐదు రోజుల శిక్షణ

- జిల్లాకు 25 మంది శిక్షణాధికారులు

సిరిసిల్ల: జిల్లాలో క్షేత్రస్థాయి శిక్షణ కోసం సెంట్రల్ సెక్రటేరియట్ సర్వీస్‌కు సంబంధించిన అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్స్ (ఏఎస్‌వో) సోమవారం వచ్చారు. ఫౌండేషన్ శిక్షణలో భాగంగా ఐదు రోజులు జిల్లాలో పర్యటిస్తారు. ఏఎస్‌వోలతో అదనపు కలెక్టర్ గౌతమ్‌రెడ్డి కలెక్టరేట్‌లో సమావేశమయ్యారు. జిల్లాలో అమలవుతున్న ప్రభుత్వ పథకాలను వివరించారు. తంగళ్లపల్లి మండలం రామన్నపల్లి, చందుర్తి మండలం సనుగుల, ముస్తాబాద్ మండలం చీకోడు, ఎల్లారెడ్డిపేట మండలం బొప్పాపూర్, గంభీరావుపేట మండలం నర్మాల గ్రామాలకు ఏఎస్‌వోలు ఐదుగురు బృందం చొప్పున వెళ్లనున్నారు. శిక్షణలో భాగంగా గ్రామీణులతో మాట్లాడి వారి అవసరాలు గుర్తించడం, అందుతున్న ప్రభుత్వ సేవలను తెలుసుకోనున్నారు. భవిష్యత్‌లో ఇంకా మంచి సేవలు అందించేందుకు తీసుకోవాల్సిన ప్రణాళికను రూపొందించాల్సి ఉంటుంది. ఎంపీడీవోలతో సమన్వయం చేసుకుంటూ.. అదనపు డీఆర్‌డీవో మదన్‌మోహన్, డీపీవో రవీందర్, శిక్షణ కో-ఆర్డినేటర్ భిక్షపతి క్షేత్రస్థాయి శిక్షణను పర్యవేక్షిస్తారు.

ముస్తాబాద్/ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): పల్లెల్లో ప్రభుత్వ పథకాల అమలు తీరు తెలుసుకునేందుకు ముస్తాబాద్ మండలం చీకోడుకు శిక్షణ అధికారులు శుభం జీఎల్, ప్రకాశ్ నంగ్లోట్, జయంత్ కనేరియా, సింఘాల్ గోపేశ్, అభిజిత్‌కుమార్ వచ్చారు. వీరికి ఎంపీడీవో రమాదేవి, సర్పంచ్ రజిత స్వాగతం పలికారు. ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్‌కు శుభంసింగ్, రాహుల్‌సింగ్, రవికుమార్ మీనా, అమిత్, నితిన్‌యాదవ్ వచ్చారు. వీరికి ఎంపీడీవో చిరంజీవి, ఎంపీవో వజీర్, కార్యదర్శి సంతోష్, ఉపసర్పంచ్ హేమలత, ఎంపీటీసీ ఇల్లందుల గీతాంజలి, అంగన్‌వాడీ టీచర్లు పద్మ, భవాని స్వాగతం పలికారు.



ఏఎస్‌వోలతో సమావేశమైన అదనపు కలెక్టర్ గౌతంరెడ్డి

క్లుప్తంగా

దుమాలలో యువకుని అదృశ్యం


రాజేందర్

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని దుమాలకు చెందిన ఉల్లి రాజేందర్ అదృశ్యమైనట్లు సోమవారం కేసు నమోదైనట్లు ఎస్సై రమాకాంత్ తెలిపారు. రాజేందర్ ఇంటర్ పూర్తి చేసి ఇంటి వద్దనే ఉంటూ వ్యవసాయం చేస్తున్నాడు. ఈనెల 11న ఇంటి నుంచి బయటకు వెళ్లిన అతను తిరిగి రాలేదు. బంధువుల ఇళ్లలో గాలించినా ఆచూకీ లభించలేదు. దీంతో అతని తండ్రి సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

68 మంది బైండోవర్


బైండోవర్ చేస్తున్న ఎక్సైజ్ అధికారులు

కోనరావుపేట: మండలంలోని వివిధ గ్రామాల్లో మద్యం, గుడుంబా, బెల్లం విక్రయాలు జరుపుతున్న 68 మందిని సోమవారం తహసీల్దార్ విజయ్ ప్రకాశ్‌రావు ఎదుట బైండోవర్ చేసినట్లు ఎల్లారెడ్డిపేట ఎక్సైజ్ సీఐ చంద్రశేఖర్ తెలిపారు. ఎక్సైజ్ నేరాలకు పాల్పడబోమని హామీపత్రంపై సంతకాలు తీసుకున్నామని పేర్కొన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు సహకరించాలని కోరారు.

నేడు కొదురుపాకలో ప్రజాభిప్రాయ సేకరణ

- హాజరుకానున్న అదనపు కలెక్టర్, కాలుష్య నియంత్రణ మండలి డీఈ

బోయినపల్లి(చొప్పదండి): మండలంలోని కొదురుపాక రైతువేదిక భవనంలో ఎస్సారెస్పీ నుంచి గౌరవెల్లి ప్రాజెక్టు వరకు పర్యావరణంపై మంగళవారం ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించనున్నట్లు మిడ్‌మానేరు డీఈఈ రాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సారెస్పీ నుంచి గౌరవెల్లి ప్రాజెక్టు వరకు మిడ్‌మానేరు ప్రాజెక్టు విస్తరించి ఉంది. దీనివల్ల పర్యావరణపరంగా ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా? అనే అంశంపై అభిప్రాయ సేకరణ చేపడుతారని పేర్కొన్నారు. అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్, కాలుష్య నియంత్రణ మండలి నుంచి డీఈ నరేందర్ హాజరవుతారని తెలిపారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి గౌరవెల్లి వరకు 8 జిల్లాల్లో ప్రజాభిప్రాయ సేకరణ చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు, మేధావులు హాజరు కావాలని కోరారు.

ముంబైలో బతుకమ్మ చీరల పంపిణీ


చీరలు పంపిణీ చేస్తున్న నాయకులు

కోనరావుపేట: మండలంలోని వెంకట్రావుపేటకు చెందిన రాపెల్లి సతీశ్ వృత్తిరీత్యా ముంబైలో ఉంటున్నాడు. ఇటీవల గ్రామానికి వచ్చి, సర్పంచ్ మంతెన సంతోష్ ఆధ్వర్యంలో బతుకమ్మ చీరలను సేకరించి, ముంబైకి తీసుకెళ్లాడు. అక్కడ సాకినాకలోని పోచమ్మ గుడి వద్ద సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో స్థానిక మహిళలకు చీరలను పంపిణీ చేశారు. వాటిని తీసుకున్నవారు హర్షం వ్యక్తం చేశారు.

‘ఓపెన్’ నిర్లక్ష్యం


‘ఇది విలీన గ్రామం పెద్దబోనాలలోని ఓపెన్ జిమ్. ప్రశాంత వాతావరణంలో ఏర్పాటు చేసిన ఈ జిమ్‌లో పరికరాలు రిపేరుకు వచ్చి నెలలు గడుస్తుంది. ఏటా మెయింటనెన్స్ కోసం నిధులు వెచ్చిస్తున్నారు. అయినా ఇలా పరికరాలు పనికిరాకుండా ఉంటున్నాయని స్థానికులు పెదవి విరుస్తున్నారు. ఎక్సర్‌సైజ్ చేసేందుకు ఇబ్బందిగా ఉందని వాకర్స్, వ్యాయామం చేసేవారు పేర్కొంటున్నారు’.


‘ఈ ఫొటోలో ఉన్నది సిరిసిల్ల పట్టణం కార్గిల్‌లేక్ ప్రాంతంలోని ఓపెన్‌జిమ్. మున్సిపల్ ఆధ్వర్యంలో మూడేళ్ల క్రితం రూ.13లక్షలు వెచ్చించి ఏర్పాటు చేశారు. కాంట్రాక్టర్ చేతివాటం, పరికరాలు నాసిరకం వెరసి ఇలా పనికిరాకుండా ఉంటున్నాయి. ఏడాది కాలంగా పనికిరాని పరిస్థితిలో జిమ్ ఉంది. మరమ్మతు చేయాలని స్థానికులు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదు.’

- పాడుబడుతున్న ఓపెన్ జిమ్స్
- పరికరాలు విరిగి.. పనికిరాకుండా..
- నీరుగారుతున్న ఆరోగ్య సిరిసిల్ల లక్ష్యం
- నిర్వహణ లోపంపై సర్వత్రా విమర్శలు



రిపేరుకు నోచుకోని ఇందిరాపార్కులోని స్మార్ట్ ఓపెన్‌జిమ్

సిరిసిల్లటౌన్: నగరాలకు దీటుగా సిరిసిల్ల నలువైపులా ఆధునిక ఓపెన్‌జిమ్స్ ఏర్పాటుచేశారు. చాలా రోజులు వీటిని వినియోగించిన ప్రజలు హర్షించారు. కానీ కొద్ది నెలలుగా వాటి నిర్వహణపై బల్దియా పట్టింపులేకుండా ఉంటోంది. ఫలితంగా ఆరోగ్య సిరిసిల్ల లక్ష్యం.. బోసిపోతున్న వైనంపై కథనం.

బోసిపోతున్న ‘స్మార్ట్’ జిమ్స్

సిరిసిల్లలో డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ (సీడీఎంఏ) ఆధ్వర్యంలో ‘వరల్డ్ బ్యాంకు’ ప్రాజెక్టు ద్వారా స్మార్ట్ ఓపెన్‌జిమ్స్ ఏర్పాటు చేశారు. ఇందిరాపార్కు, శాంతినగర్, గణేశ్‌నగర్‌లో ఒక్కొక్కటి రూ.15లక్షలు వెచ్చించి రూ.45లక్షలతో మూడుచోట్లలో ఏర్పాటు చేశారు. స్మార్ట్ సిరిసిల్ల అందాల్లో స్మార్ట్ ఓపెన్ జిమ్స్, ఔట్‌డోర్ జిమ్స్ భాగస్వాములుగా ఉంటున్నాయి. మున్సిపల్ ఆధ్వర్యంలో విలీన గ్రామాలను కలుపుకుని 23 చోట్ల ఔట్‌డోర్ జిమ్‌లు ఏర్పాటు చేశారు.

23 ఓపెన్ జిమ్స్

సిరిసిల్ల పట్టణంలో ఓపెన్‌జిమ్స్‌ను 23 చోట్ల ఏర్పాటు చేశారు. టీడీఎంఏ ఆధ్వర్యంలో చేసిన స్మార్ట్‌జిమ్స్ పోను మున్సిపల్ ఆధ్వర్యంలో జూనియర్ కళాశాల మైదానం, రగుడు, శాంతినగర్, నెహ్రూనగర్, కార్గిల్‌లేక్, పెద్దూరు, చిన్నబోనాల, రాజీవ్‌నగర్, పెద్దబోనాల, జేపీనగర్ పార్కు, పద్మనగర్, బీవైనగర్, సుందరయ్యనగర్, వెంకంపేట, నర్సింగ్‌కాలేజీ ప్రాంతం, నెహ్రూపార్కు, డబుల్‌బెడ్రూం కాంప్లెక్సు, వెంకట్రావునగర్ పార్కు, సాయినగర్ తదితర ప్రాంతాల్లో ఓపెన్ జిమ్స్ ఉన్నాయి. నిర్వహణ లోపంతో కొన్ని చోట్ల పరికరాలు పనికిరాకుండా పోతున్నాయి. పర్యవేక్షణ లోపంతో ఇటువంటి పరిస్థితి ఏర్పడుతుందని స్థానికులు చెబుతున్నారు.

నిధులు కోట్లు.. నిర్లక్ష్యంతో పాట్లు

స్మార్ట్ సిరిసిల్లలో ప్రజా ఆరోగ్యం కోసం రూ.1.75 కోట్లు ఖర్చు చేశారు. రెండేళ్ల నుంచి బల్దియా ఓపెన్‌జిమ్స్ నిర్వహణపై శ్రద్ధ వహించడం లేదు. ఫలితంగా పరికరాలు విరిగిపోవడం, ఫ్లోరింగ్ పెచ్చులూడటం వంటివి జరుగుతున్నాయి. నిత్యం వాకర్స్, వ్యాయామానికి వచ్చే వారు ఓపెన్‌జిమ్స్ పనికిరాకుండా ఉండటాన్ని అధికారులు, పాలకుల దృష్టికి తీసుకెళ్లినా స్పందించడం లేదని చెబుతున్నారు. కౌన్సిల్ సమావేశాల్లో జిమ్స్ నిర్వహణ, రిపేర్ల కోసం కౌన్సిల్ నిధుల కేటాయింపునకు ఓకే చెప్పినా వాటిని అందుబాటులోకి తేకపోవడం విమర్శలకు తావిస్తుంది.

నాసిరకంగా ఉన్నాయి



పట్టణంలోని కొన్ని ఓపెన్‌జిమ్స్‌లో పరికరాలు నాసిరకంగా ఉన్నాయి. వాటిపై అధికారుల పర్యవేక్షణ లేక పనికిరాకుండా ఉంటున్నాయి. లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసిన ఓపెన్‌జిమ్స్ ప్రజలు వినియోగించుకోకుండా ఉంటే ఏమి లాభం.

– బెజ్జిగం సురేశ్, సిరిసిల్ల

కొన్ని రోజులకే..



ఓపెన్ జిమ్స్ పరికరాలు సెలక్ట్ చేయడంలో నాణ్యత లోపం కనిపిస్తుంది. కొన్ని చోట్ల కొద్ది రోజులకే పాడైనయి. ప్రజా ఆరోగ్యంపై శ్రద్ధతో ఓపెన్ జిమ్స్ ఏర్పాటు హర్షణీయమే. కానీ వాటి నిర్వహణపై దృష్టి పెట్టాలి.

– సిరిమల్లే సత్యం, సిరిసిల్ల

రిపేర్లు చేయిస్తాం



ఓపెన్ జిమ్స్‌లో పరికరాలు పాడయిన వాటిని వెంటనే రిపేరు చేయించి వినియోగంలోకి తీసుకొస్తాం. ఎక్కడెక్కడ పరికరాలు చెడిపోయాయో సిబ్బంది పరిశీలిస్తున్నారు. అన్ని ఏరియాల్లోని ఓపెన్ జిమ్స్‌లో ప్రజలు వ్యాయామం చేసుకునేలా చూస్తాం.

– ఎండీ ఆయాజ్, మున్సిపల్ కమిషనర్



రాజన్నకు మొక్కులు

వేములవాడ: రాజన్నను సోమవారం 30 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. ధర్మగుండంలో స్నానాలు చేసిన భక్తులు కుటుంబ సభ్యులతో కలసి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ఆవరణ భక్తులతో సందడిగా మారింది. భక్తుల ద్వారా రూ.40 లక్షల ఆదాయం సమకూరినట్లు ఆలయ అధికారులు తెలిపారు.

వేములవాడలో బీజేపీ అభ్యర్థి ఎవరో?



ప్రచారం చేస్తున్న లక్ష్మీనర్సింహారావు, ఆది శ్రీనివాస్

- నియోజకవర్గంలో చర్చ
- ప్రచారం ముమ్మరం చేసిన బీఆర్ఎస్, కాంగ్రెస్ అభ్యర్థులు

వేములవాడరూరల్: వేములవాడ నియోజకవర్గ బీఆర్ఎస్, కాంగ్రెస్ అభ్యర్థులుగా చల్మెడ లక్ష్మీనర్సింహారావు, ఆది శ్రీనివాస్‌లను ప్రకటించారు. బీజేపీ అభ్యర్థిని ఇంకా ప్రకటించకపోవడంతో ఆ పార్టీ తరపున ఎవరికి అవకాశం వస్తుందోనని నియోజకవర్గ ప్రజలు చర్చించుకుంటున్నారు. మాజీ గవర్నర్ చెన్నమనేని విద్యాసాగర్‌రావు కుమారుడు వికాస్‌రావు, తుల ఉమ, ఎర్రం మహేశ్‌లు అధిష్ఠానం తమకే అవకాశం ఇస్తుందని ఎవరికివారే ప్రచారం చేసుకుంటున్నారు. చల్మెడ లక్ష్మీనర్సింహారావు, ఆది శ్రీనివాస్‌లు మాత్రం ఇప్పటికే ప్రచారం ముమ్మరం చేశారు. కుల సంఘాల వారీగా సమావేశాలు నిర్వహిస్తూ తమను గెలిపించాలని అభ్యర్థిస్తున్నారు.

బీజేపీ గెలుపులో కార్యకర్తలే కీలకం


సమావేశానికి హాజరైన బూత్‌లెవెల్ ఇన్‌చార్జీలు

- పార్టీ జిల్లా ఇన్‌చార్జి మోహన్‌రెడ్డి

సిరిసిల్లటౌన్: బీజేపీ గెలుపులో కార్యకర్తలే కీలకమని పార్టీ జిల్లా ఇన్‌చార్జి గంగాడి మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. సిరిసిల్లలోని ప్రైవేటు ఫంక్షన్‌హాల్‌లో సోమవారం బూత్‌లెవెల్ ఇన్‌చార్జీలు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. పార్టీని బలోపేతం చేయడానికి బూత్‌స్థాయిలో పనిచేయాల్సిన విధానాలు వివరించారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డబోయిన గోపి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లగిశెట్టి శ్రీనివాస్, పార్లమెంటు కన్వీనర్ ఆడెపు రవీందర్, అసెంబ్లీ కన్వీనర్ మల్లారెడ్డి తదితరులున్నారు.

ఎల్లారెడ్డిపేటలో ‘మేరీ మిట్టి మేరా దేశ్’


మాట్లాడుతున్న వాసరవేణి పర్శరాములు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండల కేంద్రంలోని జూనియర్ కాలేజీలో సోమవారం జాతీయ సేవాపథకం ఆధ్వర్యంలో అమృత కలశయాత్ర, ప్రపంచ ఆహార దినోత్సవాలు నిర్వహించారు. జాతీయ సేవాపథకం ప్రోగ్రాం ఆఫీసర్ వాసరవేణి పర్శరాములు మాట్లాడుతూ అమృత కలశయాత్ర(మేరీ మిట్టి మేరా దేశ్) ద్వారా విద్యార్థులలో దేశభక్తి, ఐక్యతభావం పెంపొందుతుందన్నారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ క్యాతం సత్యనారాయణ, చెరుకు భూమక్క, మాదాసు చంద్రమౌళి, బుట్ట కవిత, నీరటి విష్ణుప్రసాద్, ఆర్.గీత, కొడిముంజ సాగర్, చిలుక ప్రవళిక తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ మేనిఫెస్టోను బీఆర్ఎస్ కాపీ కొట్టింది

- బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య


సన్మానిస్తున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): కాంగ్రెస్ మేనిఫెస్టోను బీఆర్ఎస్ కాపీ కొట్టిందని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య ఆరోపించారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడారు. అంతకుముందు ఆదివారం రేవంత్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన మాజీ ఎంపీటీసీ ఒగ్గు బాలరాజుయాదవ్, కొమిరిశెట్టి తిరుపతిలను సన్మానించారు. పార్టీ మండలాధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ గౌస్, జిల్లా ప్రధాన కార్యదర్శి పసుల కృష్ణ, కార్యదర్శులు గిరిధర్‌రెడ్డి, రొడ్డ రామచంద్రం, కిసాన్ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి వంగ మల్లారెడ్డి, చెన్ని బాబు పాల్గొన్నారు.

టికెట్ల కేటాయింపులో బీసీలకు ప్రాధాన్యం ఏది?

- వైఎస్సార్ హయాంలో మేనిఫెస్టోలోలేని పథకాల అమలు
- విజయరమణారావుకు ప్రగతిభవన్ నుంచి నిధులు
- హైదరాబాద్ 2024 జూన్ దాకా ఉమ్మడి రాజధానియే
- మాజీ ఎమ్మెల్యే గోనె ప్రకాశ్‌రావు


మాట్లాడుతున్న గోనె ప్రకాశ్‌రావు

పెద్దపల్లిరూరల్: కాంగ్రెస్ పార్టీ ప్రతీ పార్లమెంట్ పరిధిలో రెండు స్థానాలను బీసీలకు కేటాయిస్తామన్న హామీని అమలు చేయలేదని మాజీ ఎమ్మెల్యే గోనె ప్రకాశ్‌రావు విమర్శించారు. పెద్దపల్లి జిల్లా కేంద్రంలో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. టికెట్ల కేటాయింపులో బీసీలను విస్మరించడాన్ని నిరసిస్తూ పెద్దపల్లిలో కొందరు ప్రజాప్రతినిధులు, మాజీ ప్రతినిధులు, నాయకులు పెద్దసంఖ్యలో పార్టీ మారే అవకాశాలు ఉన్నాయని జోస్యం చెప్పారు.

వైఎస్సార్ పాలన మరువలేనిది...

దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరెడ్డి ఉచిత విద్యుత్, రుణమాఫీ పథకాల అమలుకే మేనిఫెస్టోలో ప్రాధాన్యం ఇచ్చినా.. అధికారంలోకి వచ్చాక 108, 104 వాహనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ లాంటి అనేక సంక్షేమ పథకాలు అమలు చేసి ప్రజారంజక పాలన అందించారని గుర్తుచేశారు.

ప్రగతిభవన్ నుంచి నిధులు..

పెద్దపల్లిలో ప్రతిపక్ష పార్టీ అభ్యర్థి విజయరమణారావు ప్రచార ఖర్చులకు ప్రగతిభవన్ నుంచి నిధులు వస్తున్నాయని గోనె ప్రకాశ్‌రావు సంచలన వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ పార్టీకి నిధులు లేవన్నారు. బీఆర్ఎస్ పార్టీకి అడ్డదారుల్లో అడ్డగోలుగా నిధులు సమకూర్చుకున్నారని, జాతీయ రాజకీయాల్లో అవకాశమిస్తే దేశమంతటికీ తానే ఖర్చు భరిస్తానని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ప్రకటించారని గుర్తుచేశారు. పెద్దపల్లిలో గతంలో ఓసారి ఎమ్మెల్యేగా ఎన్నికైన అభ్యర్థి.. రెండుసార్లు ఓడినా తన ఆస్తులను ఏమైనా అమ్ముకున్నారా? అని ప్రశ్నించారు. ఆయనకు అధికార బీఆర్ఎస్ మంత్రులతో సత్సంబంధాలు ఉన్నాయని అన్నారు.

2024 జూన్ దాకా ఉమ్మడి రాజధాని హైదరాబాద్..

రాష్ట్రరాజధాని హైదరాబాద్ జూన్ 2024 దాకా ఉమ్మడి రాజధానిగానే ఉంటుందని ప్రకాశ్‌రావు అన్నారు. మంత్రి కేటీఆర్ హైదరాబాద్ విషయంలో అవగాహన లేకుండా మాట్లాడరని విమర్శించారు. ఈ విషయంలో తప్పనిసరి పరిస్థితుల్లో గవర్నర్‌కు జోక్యం చేసుకునే అధికారం కూడా ఉందని ఆయన తెలిపారు.

బీడీ కార్మికుల సమస్యలు మేనిఫెస్టోలో చేర్చాలి


మాట్లాడుతున్న ఎల్లారెడ్డి

కోనరావుపేట: బీడీ కార్మికుల సమస్యలను ఎన్నికల మేనిఫెస్టోలో చేర్చాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎగమంటి ఎల్లారెడ్డి డిమాండ్ చేశారు. కోనరావుపేట మండలంలోని కనగర్తిలో సోమవారం బీడీ కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు తర్వాత బీడీ కార్మికులకు రూ.2 వేల జీవన భృతి ఇస్తామని అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ అనేక ఆంక్షలతో 2014 నుంచి పీఎఫ్ లబ్ధిదారులకు పింఛన్ ఇస్తోందని తెలిపారు. 2018లో నిజామాబాద్ బహిరంగ సభలో కటాఫ్ తేదీ ఎత్తివేస్తామని, అర్హులైన ప్రతి ఒక్కరికీ జీవన భృతి ఇస్తామని ప్రకటించారని అన్నారు. కటాఫ్ తేదీ ఎత్తివేయకపోగా కొత్తగా ఒక్కరికి కూడా పింఛన్ మంజూరు చేయలేదని మండిపడ్డారు. గతంలో బీడీ కార్మికుల పిల్లలకు ఉపకార వేతనాలు, బీడీ కార్మికులకు ఇళ్లు మంజూరు చేస్తామని చెప్పి, ఇప్పటివరకు ఇవ్వలేదన్నారు. తంగళ్లపల్లి మండలంలోని బద్దెనపల్లి కార్మికుల హాస్పిటల్‌కు 26 ఎకరాలు కేటాయించి, ఏళ్లు గడుస్తున్నా ఇప్పటివరకు ఎలాంటి పనులు జరగలేదని పేర్కొన్నారు. అలాగే, నాంపెల్లిలో ఉన్న కార్మికుల ఆస్పత్రిని వేములవాడ నియోజకవర్గ కేంద్రంలోకి మార్చాలన్నారు. బీడీ కార్మికుల సమస్యలు మేనిఫెస్టోలో పెట్టిన వారికే తమ ఓటు వేస్తామని తెలిపారు. కార్యక్రమంలో టీజీబీడీ సిగార్స్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి మోర అజయ్, కార్మికులు ద్యావనపెల్లి కౌసల్య, రావులపెల్లి జ్యోతి, నీలవ్వ, జ్యోతి, మరియ తదితరులు పాల్గొన్నారు.

రూ.95 వేలు సీజ్

వేములవాడఅర్బన్: వేములవాడ నంది కమాన్ వద్ద సోమవారం సాయంత్రం ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీలోల రూ.95 వేలు పట్టుబడ్డాయి. సిరిసిల్లకు చెందిన కారు మెకానిక్ మహేశ్ సిరిసిల్ల నుంచి కరీంనగర్ వెళ్తుండగా స్థానిక నందికమాన్ వద్ద ఫ్లయింగ్ స్క్వాడ్ సిబ్బంది తనిఖీలు చేపట్టారు. కారులో వెళ్తున్న మహేశ్‌ను ఆపి తనిఖీ చేయగా రూ.95వేల నగదు లభించింది. ఈ నగదు సీజ్ చేశారు.

దాడి ఘటనలో 13 మందిపై కేసు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని రాచర్ల తిమ్మాపూర్‌లో పాత గొడవలు మనసులో పెట్టుకొని, రెండు కుటుంబాలవారు పరస్పర దాడులకు పాల్పడ్డారని ఎస్సై రమాకాంత్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. రాచర్ల తిమ్మాపూర్ గ్రామంలో ఒడ్డెర సామాజిక వర్గానికి చెందిన బత్తుల లక్ష్మి, బత్తుల కృష్ణంరాజు కుటుంబాలు పాత గొడవల కారణంగా సోమవారం ఘర్షణ పడ్డాయి. మాటామాట పెరగడంతో కర్రలతో పరస్పరం దాడి చేసుకున్నారు. ఈ ఘటనలో పలువురికి గాయాలయ్యాయి. బాధితులను సిరిసిల్ల ఏరియా ఆస్పత్రికి తరలించారు. లక్ష్మి, కృష్ణంరాజులు ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకోగా ఇరు కుటుంబాలకు చెందిన 13 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


దేవరాజు (ఫైల్)

వేములవాడఅర్బన్: వేములవాడ మండలం ఆరెపల్లి శివారులోని సిరిసిల్ల–కరీంనగర్ రహదారిపై సోమవారం రాత్రి బైక్ అదుపుతప్పి ఒకరు అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు. వేములవాడ మండలం చీర్లవంచకు చెందిన ముద్రకోళ దేవరాజు (21) బైక్‌పై కొదురుపాక వెళ్లి తిరిగి వస్తుండగా ఆరెపల్లి శివారులో ద్విచక్ర వాహనం అదుపుతప్పింది. కిందపడ్డ దేవరాజు అక్కడికక్కడే మృతిచెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రమేశ్ తెలిపారు.

గ్యారంటీ పథకాలను ప్రతీ గడపకు తీసుకెళ్లాలి

- ఏఐసీసీ కార్యదర్శి క్రిష్టోఫర్ తిలక్


మాట్లాడుతున్న క్రిష్టోఫర్ తిలక్

చందుర్తి(వేములవాడ): కాంగ్రెస్ పార్టీ అమలు చేయనున్న ఆరు గ్యారంటీ పథకాలను ప్రతీ గడపకు తీసుకెళ్లి వివరించాలని ఏఐసీసీ కార్యదర్శి, వేములవాడ నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జి క్రిష్టోఫర్ తిలక్ కోరారు. చందుర్తిలోని పెరుక కమ్యూనిటీ భవనంలో సోమవారం మండల కాంగ్రెస్ పార్టీ బూతు కమిటీల సమావేశం నిర్వహించారు. క్రిష్టోఫర్ తిలక్ మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికలను సవాల్‌గా తీసుకొని, ప్రతి కార్యకర్త సైనికుడిలా పని చేయాలని కోరారు. గతంలో ఉన్న ఎమ్మెల్యే జర్మనీకి పరిమితం కావడంతో ఈ ప్రాంత అభివృద్ధి అంతంతమాత్రంగానే జరిగిందన్నారు. మళ్లీ బీఆర్ఎస్ నాయకులు కరీంనగర్ ప్రాంత నివాసిని తీసుకొచ్చారని, ఇదే విషయాన్ని ప్రతి ఓటరుకు తెలియజెప్పాలన్నారు. ప్రజల కష్టసుఖాల్లో పాలుపంచుకున్న ఆది శ్రీనివాస్ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతి కార్యకర్త శ్రమిస్తే విజయం వరిస్తుందన్నారు. జెడ్పీటీసీ నాగం కుమార్, పార్టీ మండలాధ్యక్షుడు చింతపంటి రామస్వామి, జిల్లా కార్యదర్శులు ఇందూరి మధు, గొట్టె ప్రభాకర్, నియోజకవర్గ సోసల్ మీడియా ఇన్‌చార్జి బొజ్జ మల్లేశం, చందుర్తి, సనుగుల సింగిల్‌విండో మాజీ చైర్మన్‌లు అంచా రాంరెడ్డి, ముస్కు ముకుందరెడ్డి, ఎంపీటీసీలు మ్యాకల గణేశ్, పులి రేణుకసత్యం, వేల్పుల వనజ తదితరులు పాల్గొన్నారు.

గుండె నిండా కేటీఆర్



సిరిసిల్ల: జిల్లా కేంద్రంలోని గణేశ్‌నగర్‌కు చెందిన పవర్‌లూమ్ కార్మికుడు దాస శ్రీధర్ కేటీఆర్‌కు వీరాభిమాని. తన చాతిపై ఒక వైపు కేటీఆర్ బొమ్మ, మరో వైపు తెలంగాణ పటాన్ని టాటూ వేసుకున్నాడు. సిరిసిల్లలోని బీఆర్ఎస్ భవన ప్రారంభోత్సవానికి వచ్చిన కేటీఆర్‌ను శ్రీధర్ కలిసి తన అభిమానాన్ని తెలియజేశాడు.

బ్రహ్మచారిణికి వందనం



వేములవాడ: రాజన్న ఆలయంలో కొనసాగుతున్న శ్రీదేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం అమ్మవారు బ్రహ్మచారిణి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు.